క్లుప్తంగా

భావన్నారాయణుడికి ఏకాంత సేవ



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఏకాంత సేవ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అనుగ్రహం పొందారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా గంధ మహోత్సవం



పొన్నూరు: పట్టణంలోని అయిదో వార్డు దఫ్‌పేటలో శ్రీ హజరత్ ఖాజా బంధానవాజ్ గేసుద రాజ్ షాహ్‌బాజ్ బులంద్ పర్వాజ్ మహాత్ముల జెండా, గంధ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇదార ఏ అమినియా చిస్తియా నుంచి వాయిద్యాలతో ఇటికంపాడు రోడ్డులోని జెండా చెట్టు వరకు ప్రదర్శనగా వెళ్లారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో స్వామి వారి శిష్యబృందం పాల్గొన్నారు.

జొన్న కొనుగోలుపై అస్పష్టత

చేబ్రోలు: రబీలో సాగు చేసిన తెల్లజొన్న, మొక్కజొన్నను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆచరణలో అమలు చేయకుండా జాప్యం చేయటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది చేబ్రోలు మండలంలో రబీలో తెల్లజొన్న 2,439 ఎకరాల్లో, మొక్కజొన్న 3,669 ఎకరాల్లో సాగు చేశారు. సుమారు నెల రోజుల నుంచి రైతులు పండించిన పంట ఇంటికి చేరడం, వ్యాపారులకు విక్రయించడం, జరిగింది. కొంతకాలంగా జొన్నను ప్రభుత్వం మద్దతు ధర రూ.3,371లకు కొనుగోలు చేస్తామని ఉన్నతాధికారులు ప్రకటించటంతో రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో తెల్లజొన్న క్వింటా రూ.2,200లు ఉండగా మద్దతు ధర కన్నా వెయ్యి రూపాయిలకు పైగా తక్కువ ఉండటంతో ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని రైతులు ఎదురు చూస్తున్నారు. దీనిపై మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖాధికారులు స్పష్టమైన ప్రకటన చేయకపోవటంతో రైతుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది.

రాజధానిని రియల్ ఎస్టేట్‌గా చేస్తున్న కూటమి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాజధానిని రియల్ ఎస్టేట్‌గా చేస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ అన్నారు. గుంటూరులోని ఓ హోటల్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజధాని కట్టడానికి 1,000 ఎకరాలు సరిపోతుందని సీపీఎం రాఘవులు చెప్పారని గుర్తు చేశారు. హైదరాబాద్, మద్రాస్, కర్ణాటక, ఢిల్లీలో ఎన్ని వేల ఎకరాలు ఉన్నాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గ కుప్పంలో ద్రవిడ యూనివర్సిటీలో పనిచేసే ఉద్యోగస్తుల జీతాలు ఇంకా రాలేదని తెలిపారు. చంద్రబాబు నాయుడు చదువుకున్న ఎస్వీ యూనివర్సిటీలో ప్రొఫెసర్లకు జీతాలు అందలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వంపైనా అసంతృప్తి మొదలైందని పేర్కొన్నారు. , సీఎంకి సరైన సలహాదారులు లేరని, రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని తెలిపారు.

రవికుమార్‌కు వైకే పురస్కారం ప్రదానం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గురువారం ఆత్మీయ పురస్కార సభ నిర్వహించారు. సారిపల్లి కొండలరావు సారథ్యంలో యువ కళా వాహిని ఆధ్వర్యంలో వైకే నాగేశ్వరరావు జయంతి సందర్భంగా నిర్వహించిన సభకు యువ కళా వాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. డాక్టర్ నరాలశెట్టి రవికుమార్‌కు వైకే ఆత్మీయ పురస్కారం ప్రదానం చేశారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, రామరాజు ఫౌండేషన్ నిర్వాహకులు రామరాజు శ్రీనివాసరావు, పాలక మండలి సహ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు, శారద కళాసమితి అధ్యక్షులు దోగిపర్తి శంకరరావు, అప్కాబ్ బ్రాంచ్ మేనేజర్ పి.లక్ష్మీసువర్చల, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య మాట్లాడారు. అనంతరం డాక్టర్ నరాలశెట్టి రవికుమార్ బృందం సత్య అలరించారు. లంక లక్ష్మీనారాయణ, బొప్పన నరసింహారావు, శివశంకరశాస్త్రి, ఎంఎ.హమీద్, జి.మల్లికార్జునరావు, జానీ బాషా పాల్గొన్నారు.

అడ్డగోలుగా ఆశీలు దందా

- దినసరి మార్కెట్లలో ఇష్టారాజ్యంగా వసూళ్లు
- చెల్లించలేమంటే ఊళ్లోకి రావద్దంటూ హెచ్చరికలు
- లబోదిబోమంటున్న చిరు వ్యాపారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

పొన్నూరు: పురపాలక సంఘ పరిధిలో దినసరి మార్కెట్ వేలం దక్కించుకున్న కొందరు గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పొన్నూరు మార్కెట్‌కు సంబంధించిన వేలం పాటలో సుమారు రూ.12 లక్షలకు ఆశీలు వసూలు కాంట్రాక్టును దక్కించుకున్నారు. ఆశీలు వసూల పేరుతో చిరు వ్యాపారుల నుంచి దండిగా వసూలు చేస్తున్నారు. ఆశీలు వసూళ్లపై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడుతోంది.

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం

పట్టణంలో దూరప్రాంతాల నుంచి వచ్చి పూలు, ఉత్సవాల్లో ఆట వస్తువులు విక్రయించే వారి నుంచి ఆశీలు వసూలు చేయకూడదు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన గుత్తేదారుడిని మందలించాం. మున్సిపల్ నిబంధనల ప్రకారం గెజిట్‌లో నిర్ణయించిన రుసుం మాత్రమే వసూలు చేయాలి. దీనిపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం.

– తోట వెంకటేశ్వరరావు, ఆర్ఓ మున్సిపాలిటీ, పొన్నూరు



ఆశీలు కట్టలేనని గుత్తేదారుడితో మొరపెట్టుకుంటున్న మహిళ



ఆలయప్రాంగణంలో రూ.20 చెల్లించిన కొబ్బరికాయల దుకాణదారుడు

ఎన్నడూ లేని విధంగా..

ప్రస్తుతం పట్టణంలో శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో దూరప్రాంతాల నుంచి వచ్చిన చిరు వ్యాపారులు అధిక సంఖ్యలో చిన్న దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. అయితే వారు మూడు నాలుగు రోజులు మాత్రమే వ్యాపారాలు నిర్వహించనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఆలయ ప్రాంగణంలో ఆట వస్తువులు విక్రయించేవారు, పూలు అమ్మే మహిళలను గుత్తేదారులు డబ్బులు అడిగారు. కొద్దిపాటి పూలు అమ్మే మేము ఆశీలు చెల్లించలేమని తెలిపినా వినకుండా ముక్కపిండి వసూలు చేశారు.

సూచిక బోర్డులు ఎక్కడ..

దినసరి మార్కెట్‌కు వచ్చే వాహనాల నుంచి గెజిట్‌లో పేర్కొన్న ధరలు వసూలు చేయాలి. ఎవరెవరి వద్ద, ఎంత వసూలు చేయాలి అనేది సూచిక బోర్డులో పేర్కొనాలి. కానీ.. దీనికి సంబంధించి ఎక్కడికక్కడ బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. అవి ఎక్కడా కనిపించడం లేదు.

ప్రతి ఆరు నెలలకు టీకాలు వేయించాలి



పశువుల రక్తనమూనాల సేకరణను పరిశీలిస్తున్న డాక్టర్ కె.ప్రసూన

ప్రత్తిపాడు: ప్రతి ఆరు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.ప్రసూన తెలిపారు. జాతీయ వ్యాధి నిర్ధారణ, నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పశుసంవర్ధక శాఖ అధికారులు ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో మూగజీవాలకు నాలుగో విడత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. వ్యాధి టీకాలు వేసిన పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి ఎంత ఉందో పరిశీలించేందుకు గురువారం నడింపాలెంలో పశువుల రక్త నమూనాలను సేకరించారు. కార్యక్రమాన్ని విజయవాడ వీబీఆర్ఐ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.ప్రసూన పరిశీలించారు. నిర్ణీత సమయంలో గాలికుంటు టీకాలు వేయించడం ద్వారా పూర్తిగా వ్యాధిని నిర్మూలించవచ్చని పాడిరైతులకు వివరించారు. సిబ్బందికి సహకరించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు పశు వైద్యశాల ఏడీ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, గొట్టిపాడు పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ నందకిషోర్, వైద్యాధికారులు డాక్టర్ గురవారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతాంగ శ్రేయస్సుకు కృషి



ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రత్తిపాడు: రైతాంగం శ్రేయస్సుకు శక్తి వంచన లేకుండా కృషి చేయడం జరుగుతుందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రత్తిపాడు మండలం తిమ్మాపురంలో రూ.82 లక్షల రూపాయల వ్యయంతో వెయ్యి ఎంటీల బహుళ ప్రయోజన సౌకర్య గోదాము ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులతో ఆయన హాజరయ్యారు. గోదాముతో పాటు రూ.10 లక్షల వ్యవంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి, శిలాఫలకాన్ని మంత్రి, ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ విధివిధానాపై మాట్లాడారు. గ్రామ సర్పంచ్ కల్లూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు. గోడౌన్ నిర్మాణానికి అర ఎకరం స్థలం దానమిచ్చిన దొప్పలపూడి అంకయ్య, పిచ్చమ్మ దంపతులను మంత్రి, ఎమ్మెల్యేలు సత్కరించారు.

వీవీఐటీ అమరావతి క్రికెట్ కప్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: నిత్యం విధుల్లో నిమగ్నమయ్యే జర్నలిస్టులకు క్రీడలు ఎంతో ఉపశమనాన్ని అందిస్తాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వచ్చే నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడేట్ జర్నలిస్ట్ క్రికెట్ పోటీల బ్రౌచర్‌ను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 210 మంది అక్రిడేట్ జర్నలిస్టులు పాల్గొనడం గొప్ప విషయమని పేర్కొన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ అసోసియేషన్ 13వ వార్షికోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గుంటూరు నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్, జేకేసీ కాలేజ్ గ్రౌండ్‌లో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయని పేర్కొన్నారు.

దుర్గంధంగా మురుగు



పెదకాకాని: రోడ్డు ప్రక్కనే నిలిచిపోయిన మురుగునీరు దుర్గంధం వస్తోంది. మండల కేంద్రమైన పెదకాకాని గ్రామం మూడు పవిత్ర ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయం. గ్రామం మధ్యలో జాతీయ రహదారికి ఇరువైపులా సరీస్ రోడ్డు ఏర్పాటు చేసి ఉంది. గుంటూరు నుంచి వచ్చే వారు గ్రామంలోకి ప్రవేశించగానే రోడ్డు వెంబడి ఉన్న చెత్త, ముందుకు కదలని మురుగు నీరుతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముక్కు మూసుకునేంత దుర్గంధం వస్తోందని వాపోతున్నారు. వేసవికాలంలోనే ఈ పరిస్థితి ఉంటే వర్షాకాలంలో ఆ మురుగునీరు రోడ్డుపైకి చేరడం, దీంతో రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈదురు గాలులతో నేలకొరిగిన చెట్లు



లేమల్లెపాడు–అనంతవరప్పాడు గ్రామాల మధ్య నేలకూలిన చెట్టు

ప్రత్తిపాడు: ఆకాశం మేఘావృతమై మబ్బులు కమ్మేయడంతో మండలంలో పలు చోట్ల గురువారం వర్షం కురిసింది. ఊహించని విధంగా భారీ ఈదురు గాలులు వీస్తుండటం, ఒక్కసారిగా వర్షం కురుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాల్లో ఈదురు గాలులతో పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. కారు మబ్బులు కమ్మేయడంతో రైతులు, ప్రజలు కలవరపాటుకు గురయ్యారు. వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడు–అనంతవరప్పాడు గ్రామాల మధ్య భారీ ఈదురు గాలులకు పెద్ద పెద్ద చెట్లు నేలకూలాయి. దీంతో రాకపోకలు స్తంభించిపోయాయి. అదేవిధంగా ప్రత్తిపాడు మండలం కోయవారి పాలెం సమీపంలో మబ్బులు కమ్ముకోవడంతో కల్లాల్లో మిర్చి ఉన్న రైతులు కంగారు పడాల్సి వచ్చింది. హడావుడిగా కల్లాలపై పట్టాలు కప్పుకొనేందుకు పరుగులు పెట్టారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి



ప్రత్తిపాడు: నూతనంగా విధుల్లో చేరిన అంగన్‌వాడీ సిబ్బంది బాధ్యతాయుతంగా తమ విధులను నిర్వర్తించాలని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో(ఎఫ్ఏసీ) సీహెచ్.విజయనిర్మల అన్నారు. ప్రాజెక్టు పరిధిలోని ఆయా మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టులకు ఇటీవలే ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులను గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఆమె అందజేశారు. ఆయా సెక్టార్‌ల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆడిటోరియం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

పట్నంబజారు: నగరంలోని అమరావతి రోడ్డులో గల అన్నదాన సమాజం ఆడిటోరియం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌కు గురువారం నిర్వాహకులు వినతిపత్రాన్ని అందజేశారు. కృష్ణాజిల్లాలోని గొల్లపూడిలో ఉన్న దేవదాయ శాఖ కార్యాలయంలో అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, సేవా సదన్ అధ్యక్షుడు మిర్యాల గోపీకుమార్, భారతి సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మిర్యాల ప్రసాదరావులు కమిషనర్ రామచంద్ర మోహన్‌ను కలిసి అన్నదాన సమాజం ఆడిటోరియం పరిస్థితులను వివరించారు. అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇచ్చిన రికమండేషన్ లెటర్ కూడా అందజేశారు.

కళాశాలలో తక్కువ ధరకు సీటు ఇప్పిస్తామంటూ మోసం

చేబ్రోలు: ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో తక్కువ ధరకు సీటు ఇప్పిస్తామంటూ విద్యార్థులను మోసం చేసిన సంఘటనపై గురువారం చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన కరుణం వెంకట్రావు తమ కుమార్తెకు వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ సీటు కోసం ప్రయత్నిస్తున్నారు. 2023–24 సంవత్సరంలో రూ.4 లక్షలు సీటును రూ. లక్షకే ఇప్పిస్తానని కనిగిరి ప్రాంతానికి చెందిన షేక్ రబ్బానీ ఆశ చూపటంతో నమ్మి ఇచ్చారు. కళాశాలలో రూ.20 వేలు మాత్రమే చెల్లించి అడ్మిషన్ ఇప్పించిన రబ్బానీ మిగిలిన డబ్బులు చెల్లించలేదు. దీంతో కళాశాల యాజమాన్యం జాప్యం చేస్తుండటంపై ప్రశ్నించింది. రబ్బానీని నిలదీయటంతో మోసం చేసినట్లు గుర్తించి చేబ్రోలు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. రబ్బానీ గతంలోనూ ఈ విషయంలో పలువురిని మోసం చేసినట్లు గుర్తించారు. ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌లో చర్మ సమస్యలకు లేజర్ చికిత్స



పరికరాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ యశశ్వి రమణ, ప్రిన్సిపాల్ సుందరాచారి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో చర్మ వ్యాధి వైద్య విభాగంలో బొల్లి, తెల్ల మచ్చలు, సొరియాసిస్ వంటి చర్మవ్యాధులకు లేజర్ ఎగ్జామ్ ద్వారా చికిత్స చేసేందుకు రూ. మూడు లక్షల విలువైన పరికరాన్ని జీడీవీఎల్ గుంటూరు అసోసియేషన్ వితరణగా అందజేసింది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని వైద్య పరికరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకూ చర్మ సంబంధిత సమస్యలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ప్రాథమిక దశలోనే వాటిని గుర్తించి ఆధునిక చికిత్స అందించేందుకు నూతన వైద్య పరికరాలు అందజేయడం అభినందనీయమన్నారు. కాస్మోటిక్, లేజర్ చికిత్సలు జీజీహెచ్‌లో పేద ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చర్మవ్యాధుల వైద్య విభాగాధిపతి డాక్టర్ మోహన్‌రావు, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రీధర్, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నివారణతో డెంగ్యూకు చెక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తదితరులు

గుంటూరు మెడికల్: జాతీయ డెంగ్యూ దినోత్సవం (ఈనెల 16న) సందర్భంగా గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అవగాహన పోస్టర్లను డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిదని చెప్పారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రం చేసుకోవాలని, దోమతెరలు వాడాలని, ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించి అన్ని ఆరోగ్య కేంద్రాల్లో డెంగ్యూపై ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ ఈ. అన్నపూర్ణ, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, వైద్యులు విజయప్రకాష్, జయరామకృష్ణ, ప్రియాంక, అబూబకర్, గిరిధర్, డెప్యూటీ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, డీపీఓ సైమన్, ఆరోగ్యవిస్తరణ అధికారి శివగణేష్ పాల్గొన్నారు.

దస్తావేజులు తాకట్టు పెట్టి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

లక్ష్మీపురం: ఇంటి ఖర్చుల నిమిత్తం దస్తావేజులు తాకట్టు పెట్టి అప్పుగా తీసుకున్న వాటిని మరలా బ్యాంక్‌లో పెట్టి అధిక మొత్తంలో నగదు తీసుకుని మోసం చేసిన వ్యక్తి పై అరండల్‌పేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరిటిపాడు హనుమయ్య నగర్ ప్రాంతానికి చెందన షేక్ ఖాసింబి, భర్త వలి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఆర్థిక సమస్యల నేపథ్యంలో విజయవాడ ఎ.ఎస్.ఆర్ వీధి, మారుతీ నగర్ ప్రాంతానికి చెందిన షేక్ జానీ బాషా వద్ద 2015లో రూ.5లక్షలను దస్తావేజులు తాకట్టు పెట్టి అప్పుగా తీసుకున్నారు. ప్రతి నెలా వడ్డీ చెల్లించుకుంటూ వస్తున్నారు. అయితే, ఈ క్రమంలో ఇంటి దస్తావేజులు వాపసు తీసుకునేందుకు జానీబాషాను అడగ్గా కాలయాపన చేస్తున్నాడు. అనుమానం కలిగి ఆరా తీయగా జానీబాషా బ్యాంక్‌లో దస్తావేజులు పెట్టి రూ.19 లక్షలు రుణం తీసుకున్నాడని తెలుసుకున్నారు. దస్తావేజులను అడిగితే బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితురాలుషేక్ ఖాసింబి దిక్కుతోచక అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి భూ యజమానికి హక్కుతో కూడిన పట్టా



ప్రతినిధుల బృందానికి రీసర్వే ప్రక్రియను వివరిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ

ప్రత్తిపాడు: ప్రతి భూ యజమానికి హక్కుతో కూడిన పట్టా ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న భూముల రీ సర్వే, భూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియను అధ్యయనం చేసేందుకు 31 రాష్ట్రాలు, 5 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధుల బృందం గురువారం వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులో పర్యటించారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. రీ సర్వే జరుగుతున్న తీరును భార్గవ్ తేజ ఆయా రాష్ట్రాల ప్రతినిధులకు వివరించారు. భార్గవ్‌తేజ మాట్లాడుతూ.. వందేళ్ల క్రితం ఉన్న ల్యాండ్ రికార్డులను మార్చేందుకు, రీ సర్వే డిజిటలైజేషన్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ ఎస్.ఎస్.కె. ఖాజావలి, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, వీఆర్‌లు, ఈఆర్ఏలు, సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఊర చెరువు పరిశీలన



గుర్రపు డెక్కతో మంచాల గ్రామ ఊరచెరువు

మంచాల(చేబ్రోలు): గుర్రపుడెక్కతో నిండి దుర్వాసన వస్తోన్న చేబ్రోలు మండలం మంచాల గ్రామ ఊర చెరువును ఈవోపీఆర్డీ ఉషారాణి గురువారం పరిశీలించారు. రెండు రోజుల క్రితం మంచాల గ్రామ ఊర చెరువులోని గుర్రపుడెక్క తొలగించడానికి పంచాయతీ అధికారులు సిద్ధమయ్యారు. చెరువులో పెద్దమొత్తంలో చేపలు ఉన్నాయని పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారంటూ గ్రామస్తులు జిల్లా అధికారులు, మండలాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉషారాణి క్షేత్ర పరిశీలన చేసి పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పంచాయతీ మెంబరు రత్న పాల్గొన్నారు.

పాలిసెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందన



అన్యూన్యను అభినందిస్తున్న తిలక్‌బాబు, విజయకృష్ణ, సీతారామయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్–2025 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 326వ ర్యాంకు, జిల్లాస్థాయిలో మూడో స్థానంలో నిలిచిన విద్యార్థిని కాకుమాను అన్యూన్యను ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు అభినందించారు. విద్యానగర్‌లోని ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నారై పాలిటెక్నిక్ కళాశాల, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ సంయుక్తంగా ఇచ్చిన ఉచిత పాలిసెట్ శిక్షణ పొందిన అన్యూన్య రాష్ట్రస్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ అచీవర్స్ కార్యదర్శి కొండపనేని విజయకృష్ణ మాట్లాడుతూ ఉచిత శిక్షణ పొందిన 243 మంది విద్యార్థులందరూ పాలిసెట్‌లో క్వాలిఫై కావడంతో ఇటువంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించేందుకు స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ విజయంతో ఏటా శిక్షణ కొనసాగిస్తామని తెలిపారు. విద్యార్థినిని అభినందించిన వారిలో ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాల అడ్మిన్ మేనేజర్ బండారు సీతారామయ్య ఉన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



ఎన్‌సీసీ కేడెట్లతో జూపూడి రంగరాజు, మధుసూదనరావు, నాగభూషణం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఎన్‌సీసీ 25 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో గత ఫిబ్రవరిలో నిర్వహించిన ఎన్‌సీసీ 'బీ' సర్టిఫికెట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఎం.వి. నాగభూషణం తెలిపారు. కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడారు. పరీక్షకు హాజరైన 17 మందిలో 10 మంది ఏ గ్రేడ్, ఏడుగురు బీ గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించారని వివరించారు. అత్యుత్తమ శిక్షణ, క్రమశిక్షణకు పెద్దపీట వేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ ఎస్. మధుసూదనరావు మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ పొందిన విద్యార్థులు జాతీయ భావం, క్రమశిక్షణ, దేశభక్తి కలిగి ఉంటారన్నారు. 'బీ' సర్టిఫికెట్‌లో ఉత్తీర్ణులైన కేడెట్లకు ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ. ప్రత్యూష, ఓఎస్డీ పి.సీతారామయ్య, ఎన్‌సీసీ ఏఎన్‌వో లెఫ్టినెంట్ సీహెచ్. అజిత్‌బాబు పాల్గొన్నారు.